

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వార్త


## భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



**సైదాపురం, మే 16, ప్రభాతవార్త** మండలంలో జరుగుతున్న ప్రభుత్వ పట్టా భూములకు సంబంధించి ఎటువంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా రీ సర్వే నిర్వహించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రీసర్వే నిర్వహణ తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి వివాదరహితంగా లేకుండా భూముల రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్రజా సమస్యల వేదికపై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతులు, వాటి పరిష్కారం చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకానికి సంబంధించి ఫారంపాండ్, ఇంకుడు గుంతలు త్వరగా పనులు చేపట్టాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్‌కు ఆదేశించారు. గతంలో పూర్తయిన ఇంకుడు గుంతలు పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ నిధులతో శుభ్రం చేసే చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం సైదాపురంలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఈగ రమావేవి, ఆర్ఐ ప్రదీప్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

## అన్నార్తుల ఆకలి తీర్చేది అన్న క్యాంటీన్ : ఎమ్మెల్యే



**వింజమూరు, మే 16, ప్రభాతవార్త** రాష్ట్రంలోని అన్నార్తుల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులోని బంగ్లా సెంటర్ సమీపంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. పురోహితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పనులపై వచ్చిన వారికి స్థానిక పేదలకు ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో సుమారు 61 లక్షల రూపాయలతో సుందరంగా అన్న క్యాంటీన్ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. ఆగష్టు నెలాఖరుకు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు సుమారు 1000 మందికి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రాత్రికి భోజనం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గతంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు సంవత్సరాల నిరంతరాయంగా వింజమూరు పట్టణంలో అన్న క్యాంటీన్ సొంత నిధులతో నడిపించడం జరిగిందన్నారు. భవనానికి లీజ్ అగ్రిమెంట్ ముగిసినందున, కొంత సమయం విరామం ప్రకటించామన్నారు. ప్రభుత్వం ద్వారా అన్న క్యాంటీన్ మంజూరైనందున, దీని ద్వారానే పేదలకు రుచికరమైన భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. రెవెన్యూ కార్యాలయం ముందున్న ఈ ఖాళీ స్థలంలో అవసరమైన భవనాలను నిర్మించి ఈ ప్రాంతాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అదే విధంగా ఈ ప్రాంతంలోనే ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 2014లో అన్నా క్యాంటీన్ ప్రారంభమై 2019 వరకు నిరంతరాయంగా కొనసాగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. 2024లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఉన్న క్యాంటీన్లు మొత్తాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. అవి కాకుండా కొత్తగా కూడా అవసరమైన చోట్ల అన్నా క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొని వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే వద్దకు మహిళలు వారి వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, గువ్వల కృష్ణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, కోడూరు నాగిరెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, పాములపాటి మాల్యాద్రి, దొరస్వామి నాయుడు, కే.శ్రీనివాసులు నాయుడు, కొండపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కదిరి రంగారావు, బీజేపీ ఉపాధ్యక్షులు పి.వెంకటనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు దేగ మధుయాదవ్, సర్పంచ్ నల్లగొండ రాయుడు, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, వసంతరావు, దంతులూరు కిష్టయ్య, దాట్ల రమణారెడ్డి, కాంట్రాక్టర్ ధనుంజయ్ నాయుడు, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన పెళ్లకూరు



**కొడవలూరు, మే 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్య మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని టిడిపి రాష్ట్ర కోఆర్డినేటర్ కార్య నిర్వాహ కార్యదర్శి, కోవూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ముఖ్యమంత్రికి తెలియజేశారు.

## ముమ్మరంగా బీట్ ద హీట్ కార్యక్రమాలు

**- వేసవి నుంచి ఉపశమనం పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలి స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలి**

**- జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్, మే 16, ప్రభాతవార్త** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ మూడో శనివారం నిర్వహిస్తున్న బీట్ ద హీట్ కార్యక్రమంపై ప్రజలకు ముమ్మరంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ ఆనంద్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ వారం బీట్ ద హీట్ థీమ్‌తో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ మేరకు అన్నిశాఖల అధికారులు వేసవిలో ప్రజలకు ఉపశమనం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని, ఎండ వేడిమి నుంచి సురక్షితంగా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీ ల పరిధిలో ఖాళీగా వున్న స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని, 6 నెలల పాటు సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రైల్వేగేట్ల వద్ద షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, నగర కమిషనర్ నందన్ కలెక్టర్‌కు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భవనాలపైన రూఫ్ టాప్ గార్డెన్ ఏర్పాటు చేసుకునేలా మెప్మా గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలని మెప్మా పిడికి సూచించారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రథమ చికిత్స కేంద్రాలు, వడదెబ్బ బారినపడివారి కోసం హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. ప్రముఖ రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్స్ ఏర్పాటు చేసుకోవాలని, బిల్డింగ్‌లపై చల్లదానికి కూల్ వైట్ పెయింటింగ్ చేసుకోవాలని, చలివేంద్రాల ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం వంటి ఉష్ణోగ్రతను తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అన్ని పంచాయతీలలో పక్షులు, పశువుల కోసం నీటితొట్టెలు, నీటి పాత్రల్లో నీళ్లు నింపి అందుబాటులో వుంచాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలపై, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**నెల్లూరు కలెక్టరేట్, మే 16, ప్రభాతవార్త** జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలపై, జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళిధర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళిధర్ కలెక్టర్ ఆనంద్‌ని కలిసి జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా సైదాపురంలో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, అలాగే నెల్లూరు సిటీ పరిధిలో నిబంధనలను విరుద్ధంగా యదేచ్ఛగా సాగుతున్న ఇసుక తరలింపు పై వారు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అని సైదాపురంలో అక్రమ మైనింగ్, కలువాయిలో పక్క రాష్ట్రాలకు అక్రమంగా ఇసుకను తరలించడంపై జిల్లా కలెక్టర్ కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసామని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. ఇసుక, క్వార్జ్,శిలికా, మైనింగ్ ను టిడిపి నేతలు యదేచ్ఛగా దోచుకోవడమే పరమావధిగా మారిందన్నారు. వీటన్నింటిపై ఈరోజు జిల్లా కలెక్టర్‌ని కలిసి, వెంకట నియోజకవర్గం, నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న, అక్రమాల గురించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా నెల్లూరు సిటీ పరిధిలోని ఇసుక రీచ్‌ల నుంచి అర్ధరాత్రి పూట అక్రమంగా టన్నులు కొద్ది ఇసుకను టిప్పర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని వీటిని నియంత్రించేందుకు ఎవరు ప్రయత్నించిన రౌడీలను, గుండాలను, గంజాయి బ్యాచ్ ను ఇసుక రీచుల్లో మోహరించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు నమోదు నిరంతర ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

**ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్,మే 16 ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం సూచనల మేరకు నగర నియోజకవర్గం 117 పరిధిలో ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వై.ఓ నందన్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఆర్.ఓ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వివిధ అంశాలపై తగిన చర్యలు తీసుకోవడానికి సమావేశం నిర్వహించినట్లు తెలియజేశారు. నూతన ఓటర్ల నమోదు కోసం నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ స్థాయి కళాశాలల్లో ఓటరుగా అర్హులైన విద్యార్థులందరికీ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్ఎస్ఆర్-2025 కి సంబంధించి పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై పరిష్కారం అందించామని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో 800 నుండి 1200 మంది ఓటర్లు ఉండేలా, ప్రతి ఓటరు వారి నివాసానికి 2 కి.మీ.లోపు ఉండేలా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబడతాయని ఈ.ఆర్.ఓ వివరించారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే క్రమంలో ఉండేలా చూడాలని, గత ఎన్నికలలో చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వారికి పార్టీల బూత్ ఇన్చార్జిలుగా లేదా ఇతర సిబ్బందిగా అవకాశము కల్పించకుండా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. నియోజకవర్గంలో రాజకీయాల ద్వారా నియమించబడిన బి.ఎల్.ఎలు తమ సంబంధిత బి.ఎల్.ఓలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత పోలింగ్ స్టేషన్‌ల జాబితాలలో సహాయం అందించాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని బీ.ఎల్.వోలందరికీ శిక్షణా సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, 117- నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీ మాలిక్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్ రావు, నెల్లూరు నగర పాలక సంస్థ ఎన్నికల విభాగం సూపర్ ఇంటెండెంట్ పద్మావతి, చక్రపాణి పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుకు కష్టాలు




- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- నాటి హౌస్‌మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి అదే ప్రామాణికం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- అవసరం లేదంటున్న మంత్రి నాదెండ్ల
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- రూ.100 వసూలు చేస్తున్న సిబ్బంది
- సచివాలయాల్లో దరఖాస్తులకు పాట్లు

**నెల్లూరు కలెక్టరేట్, మే 16, ప్రభాతవార్త** కొత్త కార్డుకు కష్టాలు నూతన రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో అవస్థ..కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రద క్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యా పింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్ప దం లేదు. తాజాగా ఆశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

**నిబంధనాలు :** కూటమి ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగు సార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**మ్యాపింగ్ తంటా :** రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

**నిబంధనలు సడలించాలి :** హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

**దరఖాస్తు చేయాలంటే రూ.100 :** రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. జిల్లా పలు సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

**మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు! :** కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

**బయోమెట్రిక్స్ :** కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ **(వేలిముద్రలు)**వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్ లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

**విభజనలో కొత్త కష్టాలు :** తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది. మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్య,పిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

**ఆధార్ చిరునామాతోనే :** ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది.

**గడువు పెంచండి :** చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

## అందరివాడు అమరజీవి

## ప్రతి కార్యాలయంలో అమరజీవి చిత్రపటం పెట్టాలి



**బుచ్చి మే 16 ప్రభాతవార్త :** అమరజీవి పొట్టి శ్రీరాములు అందరి వాడని భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం అసువులు బాసిన మహానీయుడని తెలుగుదేశం నాయకులు ఎం.వి శేషయ్య,బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులు కొనియాడారు. శుక్రవారం ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు అధికారికంగా జరుపుకోవాలని ప్రకటించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆద్వర్యంలో 125వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించ బోతున్నామన్నారు. ఈనెల 18 వ తేది ఆదివారం నెల్లూరులోని అరుణాలచం వీధి,స్టోన్‌హౌస్‌పేట వద్ద ఉన్న ఎస్.బి.ఎస్ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. భారతదేశ స్వాతంత్రం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం నిరాహారదీక్ష చేసి అసువులు బాసారని గుర్తు చేశారు. ఆయన కృషితో నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరించందని అన్నారు. అంటరాని తనం నిర్మూలించాలని గిరిజనులకు ఆలయంలో ప్రవేశం కల్పించాలని ఆయన అనేక పోరాటాలు చేశారన్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన శ్రీపొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశానికి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 125 జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్బంగా దేశప్రధాని నరేంద్రమోడీకి,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉదయం బుచ్చి పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నెల్లూరులో జరిగే కార్యక్రమానికి బయలుతేరుతామని తెలిపారు. ఈకార్యాక్రమంలో కులమాతాలకు అతీతంగా అందరు పాల్గోనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరివీధి రాధాకృష్ణయ్య, సొల్లేటి ప్రభాకర్,దుగ్గిశెట్టి హరినాద్, దర్శి మాలకొండయ్య,వైవి సురేష్‌బాబు, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, ముత్యాల శ్యాంసుందర్ , సుధీర్,బచ్చు సుబ్బారావు, కారంశెట్టి ప్రసాద్, దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు ,దర్శి వెంకటేశ్వర్లు,బిజెపి నాయకులు రామిశెట్టి కళ్యాణ్, తదితరులు పాల్గోన్నారు.

## పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**కావలిరూరల్, మే16 ప్రభాతవార్త :** మెట్టప్రాంతాల్లో పండిస్తున్న పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని కావలి రైతుసంఘాల సమాఖ్య కావలి డివిజన్ కన్వీనర్ యం.మాలకొండారెడ్డి కోరారు. ఈ సందర్బంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం 140 మిలియన్ల కిలోల పొగాకుపంట సాగుకు పొగాకు బోర్డు అనుమతినిచ్చిందని తెలియచేశారు. కాని, ఆరుగాలం కష్టపడి ఖర్చులు పెరిగి సాగుచేసిన పొగాకుపంటకు గిట్టుబాటుధర రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కిలోకు 300 రూపాయలు ఇచ్చేవిధంగా కేంద్రప్రభుత్వం మరియు కేంద్రవాణిజ్య మంత్రిత్వశాఖ కృషిచేయాలని కోరడం జరిగింది. పొగాకు బోర్డు ప్రేక్షకపాత్ర వహించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆరుగాలం కష్టపడి మెట్టపొలాల్లో పొగాకు పంటను పండించిన రైతులకు ఖర్చులురాక ఇబ్బందిపడుతున్న పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు. విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించిపెడుతున్న పొగాకురైతులపై ప్రత్యేకమైన శ్రద్ధతీసుకోవాలన్నారు. పొగాకుబోర్డు ఆయా ప్రైవేటు కంపెనీవాళ్లతో చర్చించి కిలో 300 రూపాయలు గిట్టుబాటు ధర వచ్చేవిధంగా కృషిచేసి పొగాకు రైతులను ఆదుకోవాలని తెలియచేశారు. పార్లమెంటు సభ్యులు ప్రత్యేకంగా కేంద్రమంత్రిత్వశాఖతో చర్చించి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

## కావలిలో అదరగొట్టిన వర్షం



**కావలిరూరల్, మే16 ప్రభాతవార్త :** కావలి పట్టణం, కావలి మండలంలో శుక్రవారం ఉదయం వర్షం అదరగొట్టింది. ఉదయం 7 గంటలకే ఆకాశం పూర్తిగా మారిపోయి దట్టమైన మేఘాలు అలుముకోవడం జరిగింది. బలమైన ఈదురు గాలులతో వర్షం మొదలైంది. ఏకధాటిగా అరగంటకు పైగా వర్షం కురిసి కావలి పట్టణంలోని ట్రంకురోడ్డు, ఇతర రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల డ్రైనేజి పొంగి కొన్నిరోడ్లలో డ్రైనేజి బురద పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వేసవి కాలంలో ఈ వర్షం కావలి పట్టణానికి కొంతమేర ఊరటనివ్వడం జరిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిండువేసవిలో వాతావరణం చల్లబడి వర్షం కురియడంతో కావలి పట్టణ ప్రజలు కొంతమేర సేదతీరారు.

## జూన్ 5 న విజయవాడలో ఏపిజిఈఏ మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభ

**- జూన్ 5న ఏపిజిఈఏ ఛలో విజయవాడ**

**- ఏపిజిఈఏ మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ**



**నెల్లూరు కలెక్టరేట్, మే 16, ప్రభాతవార్త :** జూన్ 5,6 వ తేదీలలో విజయవాడలో ఏపిజిఈఏ రాష్ట్ర అధ్యక్షులు కె ఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరుగబోవు మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల గోడపత్రికలను నేడు ఏపిజిఈఏ జిల్లా కార్యాలయం వద్ద రాష్ట్ర ఉపాధ్యక్షులు వై రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి సుధాకర రెడ్డిలు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశిష్ట అతిధులుగా హాజరు కానున్నట్లు వారు తెలిపారు. పై మహాసభలకు జిల్లా నుండి భారీ సంఖ్యలో ఉద్యోగులు హాజరవుతారని వారు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి చింగీషా, సిటీ అధ్యక్ష కార్యదర్సులు కిరణ్ కుమార్, ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు పద్ధతలు పాటించండి.. డెంగ్యూను ఓడించండి



**ఉదయగిరి, మే 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది పురవీధులలో ర్యాలీ నిర్వహించ డమైంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశీలి ంచండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే నినాదంతో గండిపాలెం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, డాక్టర్ ఎం.శివ కల్పన అధ్యక్షతన శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవంపై ఉదయగిరి పురవీధులలో ర్యాలీ నిర్వహించడమైంది. ఈ ర్యాలీ స్థానిక సీహెచ్‌సీ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ కల్పన మాట్లాడుతూ డెంగ్యూను నివారించాలంటే మూడు పద్ధతులు పాటించాలని అన్నారు. పరిశీలించి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే స్లోగన్స్‌తో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో ఫ్రైడే డ్రైడే, దోమలు పుట్టకుండా .. కుట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆమె తెలియజేశారు. దోమకాటు నుండి రక్షణకు దోమ తెరలు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌జి నౌషద్ బాబు, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య, సీహెచ్ఓ శివకుమారి, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు,రేపు విద్యుత్‌కి అంతరాయం

**కలువాయి మే 16 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం నేడు,రేపు మండల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ జెఇ జైకుమార్ తెలిపారు.ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కొనసాగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ సందర్బంగా వారు కోరారు.

## ఎస్సీ కార్పొరేషన్ లోన్లకు ఇంటర్వ్యూలు



**ఉదయగిరి, మే16, ప్రభాతవార్త :** ఎస్సీ కార్పొరేషన్ లోన్లకు సంబంధించి రేపు ఉదయం 11 గంటలకు ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయం స్త్రీ శక్తి భవన్ నందు ఇంటర్వ్యూలు నిర్వహించబడును. ఈ ఇంటర్వ్యూలకు అటెండ్ అయ్యే అప్లికేంట్లు తమ వెంట అప్లికేషన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సర్టిఫికేట్, సంబంధిత పత్రాలను తమ వెంట తీసుకొని రాగలరని ఎంపీడీఓ అప్పాజీ తెలియజేశారు.

## వింజమూరులో తిరంగా యాత్ర సూపర్ సక్సెస్



**వింజమూరు, మే 16, ప్రభాతవార్త :** ఉగ్రవాదులకు పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూరం ద్వారా గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సంఘీభావంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ తిరంగా యాత్ర సూపర్ సక్సెస్ అయింది. శుక్రవారం సాయంత్రం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో కూటమి పార్టీల నేతలతో వింజమూరు బంగ్లా సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు తిరంగా యాత్రను నిర్వహించారు. దేశ భక్తి నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు అర్పిస్తూ 100 మీటర్ల జాతీయ జెండాతో త్రివర్ణ పతకాలను చేత భూనీ భరత మాత నినాదాలను జాతీయ గేయాలను పలుకుతూ క్రమశిక్షణగా జరిగిన తిరంగా ర్యాలీ భరతమాత బిడ్డల ఐక్యతను చాటింది. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ భారత్ సత్తాను భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలకు భారత సైన్యం సాటి చెప్పిందన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. పాకిస్థాన్ అంటేనే ఉగ్రవాదులతో నిండిపోయిన దేశంగా ప్రపంచానికి తెలుసన్నారు. అనేక సందర్బాల్లో వారిని భారతదేశం ఎదుర్కొన్న వారిలో మార్పు రావడం లేదన్నారు. మన ఔన్నత్యాన్ని విచ్చన్నం చేసేందుకు పాకిస్థాన్ కుట్ర చేస్తూ అనేక పర్యాయాలు భారతదేశం దాడి చేసిందన్నారు. అటువంటి సందర్భంలో అమాయక పౌరులు అమరులయ్యారన్నారు. పహల్గాం దాడిలో భారతమాత ముద్దు బిడ్డలు 27 మంది వీరమరణం పొందారన్నారు. ఆపరేషన్ సింధూర్లో 17 మంది జవాన్‌లో అమరులయ్యారన్నారు. అవసరమైతే ప్రతి ఒక్కరం సైనికుడిగా భారతదేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అమరులైన భరతమాత బిడ్డలకు, వీర మరణం పొందిన జవాన్లకు ఘననివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సింధూర ఆపరేషన్ గురించి దేశభక్తి గురించి, పాకిస్థాన్ ఉగ్రవాదుల తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మాజీ పోలీసు హౌసింగ్ సొసైటీ ఛైర్మన్ మెట్టుకూరి చిరంజీవి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, వింజమూరు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, గువ్వల కృష్ణారెడ్డి, చింతల శ్రీను, గణపం సుదర్శన్‌రెడ్డి, కోడూరు నాగిరెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, చల్లా శ్రీనివాసులు, వసంతరావు, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి మండల కన్వీనర్ సీహెచ్ బయన్న, వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సృజన, యల్లాల రఘురామిరెడ్డి, పాముల పాటి మాల్యాద్రి, కే.శ్రీనివాస నాయుడు, డాక్టర్ కే.మా శిలామణి, ఉదయగిరి జనసేన కోఆర్డినేటర్ కొట్టె వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కదిరి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులు పులిచర్ల వెంకట నారాయణ, మండల అధ్యక్షులు దేగ మధు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర, మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, పూసల వెంగప నాయుడు, తుమ్మల కిరణ్ కుమార్ నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, జనసేన వింజమూరు మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, కడియాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురానలు వనిపెంట హైమావతి, యాకసిరి భవాని, ఉదయగిరి మండల కన్వీనర్ సురేంద్రరెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్ రసూల్, జలదంకి జనసేన నాయకులు రామ్ చైతన్య, కమతం శ్రీనివాసులు, ఇమ్రాన్, మద్దూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, సీడీపీఓ పద్మజా కుమారి, కలిగిరి సీఐ వెంకట నారాయణ, ఎనిమిది మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్‌కు ఫోన్ల బెదిరింపులు.. చంపుతామంటూ హెచ్చరికలు



**ఉదయగిరి, మే 16, ప్రభాతవార్త :** జిల్లాలో వరుసల హత్యలు జరుగుతూ పోలీసులకే సవాలుగా మారిన తరుణంలో తాజాగా ఒక డాక్టర్‌ను ఫోన్ ద్వారా చంపుతామంటూ హెచ్చరికలు జారీ చేయటం కలకలం సృష్టిస్తోంది. ఒక సారి కాదు.. రెండు సార్లు కాదు పదే పదే చంపుతామంటూ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని డాక్టర్ వాయుగుండ్ల హజరత్ బాబు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఉదయగిరిలో తనకు భూమి ఉందని తన భూమిలో తాను సాగు చేసుకునే క్రమంలో భూమికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులని వారు ఐదు మంది ఉదయగిరికి చెందిన వారిని వారికి నెల్లూరులోని అల్లరి మూకలతో అత్యంత సంబంధాలు కలిగి ఉన్నారని ఉదయగిరికి వస్తే చంపుతామని రాకపోయినా నెల్లూరులోని బృందావనం వీధిలో ఉన్న విజేత కంటి వైద్యశాలకు వచ్చి పేషెంట్ల ముసుగులో లోపలికి వచ్చి చంపితే ఏం చేస్తావని ఫోన్‌లో తరచూ బెదిరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పేషెంట్లను కలిసి తను పేషెంట్లతో పాటు మరొక మనిషితో మాత్రమే మాట్లాడవలసి వస్తుందని వారు చెప్పినదాన్ని బట్టి నాకు ప్రాణహాని ఉందని అర్థమవుతుందని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించాలని డాక్టర్ కోరుతున్నారు.

## ఖాళీ స్థలాలకు నోటీసులు ఇచ్చి పన్నులు వసూలు చేయండి

**- కమిషనర్ వై.ఓ నందన్.**



**నెల్లూరు కార్పొరేషన్,మే 16 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ఖాళీ స్థలాలను గుర్తించాలని, వాటి యజమానులకు నోటీసులను జారీ చేసి, పన్నులను వసూలు చేయాల్సిందిగా కమిషనర్ వై.ఓ నందన్ అధికారులను ఆదేశించారు.పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 9 వ డివిజన్ నజీర్ తోట, కుసుమ హరిజనవాడ, ఎఫ్.సి.ఐ కాలనీ తదితర ప్రాంతాలలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో జరుగుతున్న డ్రైన్ కాలువల పూడికతీత పనులను, సిల్ట్ ఎత్తివేత కార్యక్రమాలను కమిషనర్ పర్యవేక్షించారు. మేజర్, మెయిన్ డ్రైన్ కాలువల సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అన్ని డివిజన్లలో చేపడుతున్నామని, డ్రైను కాలువల్లో పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగింపుతో మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగి దోమల ఎదుగుదలకు ఆస్కారం లేకుండా పోతుందని కమిషనర్ తెలిపారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలోని భవనాలను కమిషనర్ కొలతలు వేయించి, అసెస్మెంట్, ఇంటి పన్ను డిమాండ్ లను తనిఖీ చేశారు. తనిఖీలలో భవన నిర్మాణ కొలతలకు, ఇంటి పన్ను డిమాండ్ కు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉండటంతో సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన మేరకే భవనాల నిర్మాణాలను చేపట్టాలని, అక్రమ నిర్మాణాలు, అనధికార కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించి వేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైల్వే గేట్లవద్ద చలవ పందిళ్ళు

**నెల్లూరు కార్పొరేషన్,మే 16 ప్రభాతవార్త:** కార్పొరేషన్ పరిధిలోని వివిధ రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద గేటు వేసి ఉన్న సమయంలో ఎదురుచూసే ప్రయాణికులకు ఎండ తీవ్రత నుంచి రక్షించేందుకుగాను నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు గ్రీన్ మ్యాట్ చలవ పందిళ్ళు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. స్థానిక రంగనాయకులపేట, కొండాయ పాలెం, బి.వి నగర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద ఎండ తీవ్రతను తగ్గించే సామర్థం గల షేడ్ నెట్ గ్రీన్ మ్యాట్ చలవ పందిళ్లను ప్రస్తుతం ఏర్పాటు చేశామని, ప్రధాన రోడ్డు మార్గాల్లోని కూడళ్లలో కూడా నీడ వసతిని త్వరితగతిన కల్పించనున్నామని కమిషనర్ శుక్రవారం వెల్లడించారు.



## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



**చేజర్ల మే 16 ప్రభాతవార్త :** చేజర్ల మండలం ఆదూరుపల్లి గిరిజన కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన ముగ్గురు బాధితులకు శుక్రవారం చేజర్ల తహసిల్దారు బి మురళీ తక్షణ ఆర్ధిక సహాయం అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు బాధితులకు ప్రభుత్వ పరంగా అందా ల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. హౌసింగ్ అధికారులతో మాట్లాడానని బాధితులకు పక్కా ఇళ్ళు కట్టించే ఏర్పాటు చేస్తానని తెలిపారు.బాధిత కుటుంబాలకు 5 వేల రూపాయాలు నగదు, నిత్యవసర సరుకులు అందజేశారు. అలాగే నెల్లూరు ఐటిడిఏ అధికారులు బాధితులకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు.కాగా గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్ళు దగ్ధమై య్యా యి.విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి వుండవచ్చునని అనుమా నిస్తున్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు,రెవిన్యూ సిబ్బంది,స్ధానిక నాయకులు పాల్గోన్నారు.

## ఆకు కూరలు తినండి - రక్తహీనతను తగ్గించండి



**ఆత్మకూరు,మే16,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరవికాసం-వేసవి శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసిలి సెక్టార్ సూపర్‌వైజర్ నారాయణమ్మ పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్త వాణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు . ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత వలన కిశోరబాలికలు తాము చదువుకునే సమయంలో కళ్ళుతిరిగి పడిపోవడం, ఎక్కువ సేపు చదవ లేకపోవడం , ఏపనిమీద నిలకడగా ఉండలేకపోవడం తదితర సమస్యలు ఎదురవుతాయన్నారు. కావున కిశోరబాలికలు రక్తహీనత వలన కలిగే ఇబ్బందుల గురించి తెలుసుకోవాలన్నారు. భవిష్యత్తులో కాబోయే తల్లులైన కిశోరబాలికలు రక్తహీనతపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. రక్తహీనతను తగ్గించేందుకు తాము తీసుకునే ఆహారంలో అధికంగా ఆకుకూరలు, పాలు, గుడ్లు తదితరాలుండేలా చూడాలన్నారు. ఇందుకోసమే వేసవి శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. కావున అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని కిశోరబాలికలకు ఈవిషయంపట్ల అవగాహన పెంచి భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన తల్లులుగా మారాలని , ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.మస్తానమ్మ, లక్ష్మీనారాయణమ్మ, వేణుకుమారి , ఎంఎస్‌కెలు, ఆశవర్కర్లు, హెల్పర్లు, కిశోరబాలికలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పొలాలలో మృతదేహం



**సీతారామపురం మే 16 ప్రభాతవార్త :** సీతారామపురంలోని పోలాయకుంటకు వెళ్ళే మార్గంలోని 6 లైన్ జాతీయ రహదారి పక్కనే వున్న పొలాలలో విగతజీవిగా పడివున్న ఒ మృతదేహం లభ్యమైంది .ఎస్ఐ శివకృ ష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మృతుడు సీతారామపురం మండలంలోని గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య (63) గా గుర్తించామని అన్నారు.సీతారామపురం లో ఉదయాన్నే అటుగా వాకింగ్‌కి వెళ్ళిన కొందరు మృతదేహాన్ని గమనించి వెంటనే సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకు న్నామని అన్నారు. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు 2 రోజుల క్రితం ఇంట్లో వంటికి వాడుకునే ఎండు కట్టిల కోసం అడివికి వెళ్లారని కట్టెలు ఏరుకొనే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయం కావడంతో మృతి చెంది వుంటాడని కుటుంబసభ్యులు తెలిపారని అన్నారు. మృతునికి బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు.కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి పోస్టు మాష్టరం కోసం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అన్నారు.

## స్నేహితుడే హంతకుడు.. వేదయపాలెం మర్డర్ కేసు చేధించిన పోలీసులు



**నెల్లూరు క్రైమ్ మే 16 ప్రభాతవార్త:** నగరంలోని అయ్యప్ప గుడి కూడలి ప్రాంతంలో ఈనెల ఆరవ తేదీ జరిగిన హత్య కేసులో మృతుడి స్నేహితుడే నిందితుడని నిర్ధారించుకున్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై శుక్రవారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జీ.కృష్ణ కాంత్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఉదయగిరి మండలం సర్వరాబాదుకు చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్న (40) స్థానిక వెంకటరెడ్డి నగర్ నాలుగో వీధిలో తన స్నేహితుడైన ఓబుల రాజుకు చెందిన ఇంట్లో ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎంపిక చేసుకుని వారికి బ్యాంకుల నుండి రుణాలు ఇప్పిస్తూ కమిషన్ తీసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలోనే తన స్నేహితుడైన మర్రిపాడు,మండలం తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన సరస్వతి వెంకటేశ్వర్లుకు రూ. 67 లక్షలు రుణం ఇప్పించాడు. అందులో తానే రూ. 10 లక్షలు తీసుకొని, ఈ మొత్తంతో వ్యాపారం చేద్దామని మోసపు మాటలు చెప్పి, తిరిగి అడిగి నప్పుడు వ్యంగ్యంగా సమాధానం చెబుతుండడంతో వెంకటేశ్వర్లు చిన్నపై కక్షపెంచుకున్నాడు. తాను ఇతరుల వద్ద తీసుకున్న అప్పు గురించి వారు నిలదీస్తుంటున్నారంటూ ముద్దాయి ఎన్నిసార్లు మృతుడికి తెలిపి నప్పటికీ స్పందించలేదు. తనతో పాటు మరికొందని మోసం చేసి, ఆ మొత్తాన్ని తన భాగస్వామ్య ఫైనాన్స్ వ్యాపారానికి మళ్లించినట్లు గుర్తించిన వెంకటేశ్వర్లు, చిన్నపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం నుండి మృతుని వెంటే ఉంటూ అతను ఉన్న ఇంట్లోనే నమ్మకంగా ఉండి, అర్ధరాత్రి సోఫాలో నిద్రిస్తున్న మృతుని ముఖంపై డంబెల్ తో దాడి చేసి, దిండుతో మొఖంపై బలంగా నొక్కి ఊపిరి ఆడకుండా చేసి చంపాడు.అనంతరం సోఫాపై కారం చల్లి,ఆధారాలు దొరక్కుండా ప్రయ త్నించి, ఏమి జరగనట్లు ఆరవ తేదీ ఉదయం చుట్టుపక్కల వారికి, మృతుని కుటుంబ సభ్యులకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చిన్నయ్యను హత్య చేసినట్లు చెప్పాడు. ఈ సంఘటనపై ఉన్నతాధికారుల ఆదేశా లతో నగర డిఎస్పి సింధు ప్రియ పర్యవేక్షణలో ఇన్చార్జి సీఐ మంద రోశయ్య అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టగా వెంకటేశ్వర్లు పాత్ర ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పడారుపల్లి వద్ద ఉన్న వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్చార్జి రోశయ్య, ప్రస్తుత సీఐ శ్రీనివాసరావు, సిసిఎస్ సీఐ సీతారామయ్య, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## ఛైర్‌పర్సన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన గుత్తా



**బుచ్చి మే 16 ప్రభాతవార్త :** బుచ్చి నగర పంచాయితీ అధ్యక్షులుగా ఎంపికైన టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివా సులు మర్యాదపూర్వకంగా ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ కలిశారు.ఈ సందర్బంగా ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ నూతన అధ్యక్షులు గుత్తా శ్రీనివాసు లున్ని అభినందించారు.ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు మాట్లాడుతు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో బుచ్చిరెడ్డిపాళెం టిడిపి నగర అధ్యక్షులుగా ఎంపిక కావడం జరిగిందని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పాత,కొత్త నాయకులిందర్ని కలుపుకొని క్షేత్రస్ధాయి నుండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## గుడిపల్లి కాలువ వద్ద రక్షణ కవచం ఏర్పాటు



**బుచ్చి మే 16 ప్రభాతవార్త :** బుచ్చి నగర పంచాయితీ ఏడవ వార్డులోని గుడిపల్లి కాలువ వద్ద ఇనుప రాడ్డుల తో రక్షణ కవచం ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమీషనర్ బాల కృష్ణ, వైస్ ఛైర్మన్ పఠాన్ నస్రీన్, టిడిపి నగర్ అధ్యక్షు లు గుత్తా శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు ఎం.వి శేషయ్య, రక్షణ కవచాన్ని పరిశీలించారు. కాలు వకు రక్షణ లేకపోవడంతో కాలువలో పిల్లలు పడుతుండడంతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు. మైనార్టీనాయకులు పఠాన్ మహబూబూ భాషా,కౌన్సిలర్ రహమత్, కౌన్సిలర్ రాచూ రుసత్యం , సుభాహిని, మాజీ ఎంపిటిసి షేక్.ఫర్వీన్,స్దానిక ప్రజలు ఉన్నారు.

## టిడిపి మండల అధ్యక్షులుగా నీలం మల్లికార్జున్ యాదవ్

**- కష్టానికి వరించిన అధ్యక్ష పదవి**

**- ఎమ్మెల్యే సోమిరెడ్డికి ధన్యవాదాలు తెలిపిన మండల టిడిపి నాయకులు**



**ముత్తుకూరు, మే 16, ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెంట ఉండి గెలుపుకు కృషి చేసిన బిసి కులానికి చెందిన నీలం మల్లికార్జున యాదవ్‌కు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండల అధ్యక్షలు పదవిని కట్టపెట్టారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్టానం గుర్తు పెట్టుకుని వారికి అండగా ఉంటుందని మండల పార్టీ వర్గాలు తెలిపాయి. టిడిపి పార్టీ అధ్యక్షులుగా నీలం మల్లికార్జున్ యాదవ్‌ని నియమించడం ఆనందంగా ఉందని నాయకులు, కార్యకర్తలు తెలిపారు. అలాగే బిసి సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి ముత్తుకూరు మండల టిడిపి అధ్యక్షులుగా అవకాశం ఇవ్వడంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డికి మండల నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయిని దర్శించుకున్న శ్రీశ్రీశ్రీ రామానందభారతీస్వామి



బుచ్చి మే 16 ప్రభాతవార్త పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి ని విశాఖపట్నం శ్రీ మౌనానంద తపోవనం శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠం పీఠాదిపతులు శ్రీశ్రీశ్రీ రామానంద భారతీస్వామిజి శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్బంగా కార్య నిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి స్వామిజిని ఆలయ మర్యాదలతో స్వా గతం పలికారు.స్వామిజీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిధులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## గ్రామ వ్యవసాయ సహాయకురాలు రేవతి మృతి



**సైదాపురం, మే 16, ప్రభాతవార్త** : మండల పరిధిలోని తుమ్మలతలుపూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలుగా విధులు నిర్వ హిస్తున్న వరిగొండ రేవతి(27) గురువారం రాత్రి మృతి చెందారు. సైదాపురం గ్రామానికి చెందిన రేవతి గత కొంత కాలంగా డయాలసిస్‌తో బాధపడుతుంది. దీంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత గురు వారం డిశ్చార్చ్ అయింది. అయితే గురువారం రాత్రి ఒక్క సారిగా పల్స్ పడి పోవడంతో ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో రేవతిమృతి పట్ల ఎంపీడీఓ పురుషొత్తం శివకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి, మండల స్థాయి అధికారులు, తోటి వ్యవసాయ సహాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## మన మిత్ర సేవలు సద్వినియోగం




**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పౌర సహాయ సేవా కార్యక్రమాల్లో భాగంగా అవసరమైన వివిధ పౌర సేవలకు సులభంగా , సమర్థవంతంగా సేవలు అందించేందుకు గానూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని గ్రామ సచివాలయ పరిధిలోని పౌరులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ డిస్ప్లే బోర్డులను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

## డెంగ్యూ నివారణే లక్ష్యం



**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త-వైద్యం :** డెంగ్యూ వ్యాధి నివారణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వంగల సుజాత అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత ఆధ్వర్యంలో డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం నుంచి సంతపూట గుప్తా పార్కు వరకు జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడీసీ ఈజిప్ట్ అనే ఆడదోమ కుట్టడం ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని, కంటి నొప్పి కంటి వెనుక భాగంలో నొప్పి, కండ్లు ఎర్రబారడం, కండరాల నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రటి ఎర్రటి మచ్చలు, వాంతులతో కూడిన తీవ్రమైన జ్వరం లక్షణాలు కలిగి ఉంటుందన్నారు. పగటి పూట కుట్టే ఈ దోమ ద్వారా 7 నుండి 10 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి పరీక్షలు చేయించుకుని, తగిన చికిత్స సకాలంలో తీసుకుంటే ఈ వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి ఈ వ్యాధి నయమవుతుందని తెలియజేశారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ డెంగ్యూ నివారణ కొరకు నియంత్రణ కొరకు, నిర్మూలన నిబద్ధతతో పని చేస్తుందని, దానికి ప్రజల సహకారం పూర్తిగా అందించాలని, నివారణే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలియజేశారు. అనంతరం జిల్లా మలేరియా నియంత్రణ అధికారిణి ఇ.హుస్సేనమ్మ మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు చెక్, క్లీన్, కవర్ అనే మూడు పద్ధతులను పాటించాలని, అవి చుట్టు పక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడాలని, అటువంటి నీటి నిల్వలను శుభ్రం చేయించడం ద్వారా తొలగించాలని, నీరు నిల్వ ఉంటే తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉం చాలని, ఈ మూడు పద్ధతులను తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ వ్యాధి నివారణకు దోమలు కుట్టకుండా పుట్టకుండా చూసుకోవాలని, వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే తగిన చికిత్స తీసుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ షేక్ ఖాదర్ వలీ, సహాయ మలేరియా ఆఫీసర్ వి.నాగార్జునరావు, జిల్లా పీఎంపీ అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, పీఎంపీ సభ్యులు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసు సిబ్బంది, ఫైలేరియా కార్యాలయ సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలి



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కిశోర బాలికలు కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తప్పనిసరిగా అవసరమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు సెక్టార్ పరిధిలోని అట్ల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం దీనమ్మ మాట్లాడుతూ ఈ వయస్సులో ఐరన్ అధికంగా ఉండే కోడిగుడ్లు, ఆకుకూరలు, సివిటమిన్ ఎక్కువగా ఉండే పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించడంతో పాటు నులిపురుగుల మందులను సకాలంలో తీసుకోవాలన్నారు. ఐరన్ లోపం ఉంటే ఏయే వ్యాధులు వస్తాయో కిశోర బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ రాజకుమారి లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు ఉన్నారు.

## ఇనమడుగులో డెంగ్యూ ర్యాలీ




**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇనమడుగు పురవీధుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు , ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్‌లు మాట్లాడుతూ ప్రదానంగా ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా నీటి నిల్వలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉంటే దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పరిసరాల పరిశుభ్రతపై మరింత అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



**కోవూరు, మే 16 ప్రభాత వార్త ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలసి ఉన్న విఘ్నేశ్వరునికి బుధ వారం సంకటహర చతుర్థి పర్వ దినం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగ రాజా చార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యమ్రంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సొసైటీల అభివృద్ధికి రైతులు సహకరించాలి



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** ప్రాథమిక సహకార సొసైటీలు కేవలం రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా రైతులు పండించిన ధాన్యాలను కొనుగోలు చేసి వారికి సకాలంలో డబ్బులు అందించడంలో కీలకపాత్ర పోషించారని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని పెట్రోల్ బంక్ ప్రాంతంలో పడుగుపాడు సహకార సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలు జిల్లా కలెక్టర్ సూచనలతో స్వచ్ఛ ఆంధ్ర , స్వచ్ఛ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఈ వేసవిలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సహకార సొసైటీల్లో మూడవ శనివారం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఇదివరకే ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వేసవి తాపం తగ్గించేందుకు అవసరమైన చర్యలు కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పక్షులకు అవసరమైన నీటిని బౌల్స్‌లో ఏర్పాటు చేయడం, ఇంకుడు ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం , వేసవి తాపం తగ్గించేందుకు ప్రజలకు తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. పడుగుపాడు సొసైటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 30 కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సొసైటీలో ప్రస్తుతం కేవలం రైతులకు ఇవ్వడమే కాకుండా పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీ, జనరిక్ ఔషద షాపులను ఏర్పాటు చేసేలా దశలవారీగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. అనంతరం చలివేంద్రం ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, డీఆర్ తిరుపాల్‌రెడ్డి, ఎస్‌డీఎల్‌సీవో సుభాషిణి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె. సుబ్రహ్మణ్యం, సొసైటీ సీఈవో కె. గోవర్ధన్‌రెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, వేగూరు సుబ్బానాయుడు, చింతలపూడి పెంచలయ్య, సూపర్‌వైజర్ బాబు, సొసైటీ ఉద్యోగులు ఉన్నారు.

## నేడు వైసీపీ మండల కార్యాలయం ప్రారంభం



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :**కోవూరులోని పాటూరు రోడ్డులో శనివారం వైసీపీ పార్టీ మండల కార్యాలయాన్ని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డిలు పరిశీలించారు. మండల వ్యాప్తంగా భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వస్తున్న దృష్ట్యా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు ప్రసాద్, నేతలు శ్రీనివాసులురెడ్డి, సుబ్బయ్య , తదితరులు ఉన్నారు.

## న్యాయవాదుల గుమస్తాల సంఘం ఏకగ్రీవం



కోవూరు, మే 16 ప్రభాతవార్త : కోవూరుకు సంబంధించి న్యాయవాదుల గుమస్తా సంఘాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎటువంటి పోటీ లేకుండా ఎన్నుకున్నారు. ఈ సంఘం నూతన అధ్యక్షులుగా ఎస్‌కే మీరా మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్. భార్గవ్, కార్యదర్శిగా సీహెచ్ శేషయ్య, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ వినోద్‌లు ఏకగ్రీవంగా ఎన్నకయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన న్యాయవాదుల గుమస్తా సంఘాన్ని పలువురు న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్స వాల్లో భాగంగా శుక్రవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత స్తపన, సహస్ర నామార్చన కార్యక్రమాలను సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరిం చారు. ఈ సందర్భంగా పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మద్దూరు శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## రేవతి అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**సైదాపురం, మే 16, ప్రభాతవార్త :** తుమ్మలతలుపూరు గ్రామ సేవ కేంద్రంలో వ్యవసాయ సహాయకురాలుగా విధులు నిర్వ హిస్తున్న అనారోగ్య కారణంగా మృతి చెందిన వరిగొండ రేవతి మృతేహానికి టీడీపీ నాయకులు అమ్మినేని సుబ్రహ్మ ణ్యం నాయుడు, వరిగొండ సురేంద్ర, దా మో దర్‌నాయుడు, రాఘవరెడ్డి, విజయరెడ్డి శుక్రవారం నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలతలుపూరు గ్రామం, మండల టీడీపీ సీనియర్ నాయకుడు పెమ్మసాని దిలీప్‌చౌదరి రేవతి అంత్యక్రియలు నిమ్మితం ఎంపీడీఓ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని టీడీపీ నాయకులు తమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు ద్వారా వారి కుటుంబానికి అందించారు.

## ఆనెమడుగులో బలవంత భూసేకరణను నిలుపుదల చేయాలి



**కావలిరూరల్, మే16 ప్రభాతవార్త :** కావలిరూరల్ మండలం ఆనెమడుగు పంచాయితీలో బలవంత భూసే కరణను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు తాళ్లూరి మాల్యాద్రి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోకసాని రమేష్, సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్యలు తెలియచేశారు. కావలి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కాలంలో కావలి మండలం ఆనెమడుగు పంచాయితీలో బలవంతపు భూసేకరణ పేరుతో రాష్ట్రప్రభుత్వం బిపిసియల్ కంపెనీకి ఎనిమిది వందల ఎకరాలపైన భూసేకరణ చేయబోతుందని ఆయా గ్రామాల రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలియచేశారు. ఈ గ్రామాలలో చాలామంది గీత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తివాళ్లు, రైతులు నివసిస్తున్నారని తెలియచేశారు. దీనివలన ఆ గ్రామాల రైతులు, వృత్తిదారులు బతుకుదెరువు బుగ్గిపాలు అవుతుందని కనుక ప్రభుత్వం బిపిసియల్ కంపెనీకి సదరు భూములను తీసుకునేటటువంటి ప్రయత్నాన్ని ఆపాలని తెలియచేశారు. దీనివలన రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర వృత్తిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కావలి ఆర్డీఓ కార్యాల యంవద్ద, గ్రామసభల్లోనూ, కలెక్టర్‌వద్ద తదితర రూపాల్లో ఆందోళలను నిర్వహించడం జరిగిం దన్నారు. అయినా ప్రభుత్వం భూములు తీసుకోవాలని పట్టుదలతో ఉందని దీనిని విరమించుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. పలు సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మధ్యనే మన రాష్ట్రక్యాబినేట్‌వాళ్లు గుడ్లూరు మండలం రావూరు గ్రామంలో గ్రామస్తులు అడిగిన రేటు కాకుండా చాలా స్వల్పంగా పెంచి మేము పెంచు తున్నామని చెప్పడం జరిగిందని అది సరైనటువంటి రేటు కూడా కాదని తెలియచేశారు. రైతులు అడిగేట టువంటి 2013 భూసేకరణ చట్టం ప్రకారం రాయితీలు ఇవ్వాలని కోరడం జరిగింది. 2013 భూసేకరణ ప్రకారం ఇవ్వాల్సి న నష్టపరిహారాన్ని వృత్తిదారులకు కాని, వ్యవసాయకార్మికులకు కాని ఇవ్వవలసిన సదుపా యాలు ఇవ్వాలని కోరారు. కావలి కాలువ కింద 74000 ఎకరాలకు నీళ్లు ఇస్తామని జిల్లా ఇరిగేషన్ బోర్డులో చెప్పడం జరిగిందని ఇప్పటివరకు కావలి కాలువ చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇవ్వలేదని తెలియ చేశారు. సాగునీరు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు మద్దతుధర, ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు, రోజుకూలి 600 రూపాయలు ఇవ్వాలని, అనంతరం వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేయాలని తెలియచేశారు. రైతులు పండించినటువంటి పంటకు మద్దతు ధర ఇవ్వాలని స్వామినాధన్ కమీషన్ సిఫార్సు అమలు జరపాలని తెలియచేశారు. సంఘటిత కార్మికులకు కనీసవేతనం 26వేల రూపాయలు ఇచ్చి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది.

## వార్త కథనానికి స్పందన
## ఎంపిడిఒ కార్యాలయం చలివేంద్రం ఏర్పాటు




**మనుబోలు మే 16 ప్రభాతవార్త :** మనుబోలు ఎంపిడిఒ కార్యాలయం వద్ద మూడనాళ్ళకే మూత పద్ద చలివేంద్రం అన్న వార్త ప్రచరించడం జరిగింది. ఈ వార్తకు స్పందించిన మనుబోలు ఎంపిడివో చలివేంద్ర ఏర్పాటు చేసి కుండలతో నీళ్ల నింపారు. ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు.

**డాక్యుమెంటు పోయినది**

టిడ్కో హౌస్ ప్లాట్ డాక్యుమెంట్ దారుడు మెరువ శ్రీనివాసులు తండ్రి లేట్ వెంకటయ్య నివాసం 11/670, కటారిపాళెం, సంతపేట, నెల్లూరు. నాకు అల్లీపురం నందు టిడ్కో హౌస్ స్థలం డాక్యుమెంట్ ఇవ్వబడినది. ఆ డాక్యుమెంట్‌ని ఇంటి నుంచి తీసుకుని జెరాక్స్ సెంటర్‌కు వెలుతుండగా పోయినది. కావున ఎవరికైన దొరికిన యెడల **9652315377** ఈ నెంబర్‌కి సమాచారం అందించవలసినదిగా కోరుతున్నాము.

## వరిణి సర్పంచ్ తల్లి ఆరోగ్యాన్ని ఆరా తీసిన మాజీ మంత్రి



**విడవలూరు, మే 16 ప్రభాతవార్త:** మండలం గాదెల దిన్నె గ్రామంలోని హరిజనవాడలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అర్చకులు సాంప్రదాయాలతో స్వామివారి దర్శనం చేయించి తదుపరి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వరిణి గ్రామ సర్పంచ్ రావిళ్ళ మల్లికార్జున తల్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, వైసీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, విడవలూరు జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ ప్రాంతాల్లో పర్యటించిన వైద్య బృందం



**అనంతసాగరం, మే 16, ప్రభాతవార్త :** మండలంలోని బొమ్మవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం వైద్యనిపుణులు పర్యటించారు. మండలంలోని యాకర ్లపాడు, గోవిందంపల్లి గ్రామాల్లో జిల్లా ఫ్లోరోసిస్ నిపుణులు డాక్టర్ సి.హెచ్.దివ్య వైద్య బృందం పర్యట ించి పిల్లలకు, ప్రజలకు వైద్యపరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో బృందంలోని లా ్యబ్ టెక్నీషియన్ నీటి పరిక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భీమవరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అశోక్, హెల్త్ అసిస్టెంట్ నరసారెడ్డి, ఎఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## 18న జెవివి మండల మహాసభ

**మర్రిపాడు, మే 16, ప్రభాతవార** : మర్రిపాడు మండల జనవిజ్ఞాన వేదిక మండల మహాసభను 18వ తేదీ ఆదివారం జరుగుతుందని జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కంటి పోలయ్య శుక్రవారం తెలిపారు. ఈమహాసభకు ముఖ్యఅతిథులుగా జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ జి.సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కె.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదరి ్శ డి.చక్రపాణి, హాజరవుతారన్నారు. ఈమహాసభలో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కావున మండలంలోని జనవిజ్ఞాన వేదిక సభ ్యలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఏటీఎం లేక ప్రజల ఇక్కట్లు




**దగదర్తి, మే 16, ప్రభాతవార్త :** దగదర్తిలో ఏటీఎం లేక ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. కెనరా బ్యాంకు ఒకటి ఉండగా ఏటీఎం కొన్ని రోజులే ఉండి మూత పడిపోయింది. మూడు సంవత్సరాల నుంచి ఏటీఎం లేక ప్రజల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. బ్యాంకు మేనేజర్‌కి ఎన్ని సార్లు చెప్పినా మేనేజర్లు మారిపోతున్నారు తప్ప ఏటీఎం మాత్రం రాలేదు. ఇదే అదునుగా చూసుకుని కమీషన్ తీసుకునే షాపులు అధిక సంఖ్యలో ధనం వసూళ్ల చేస్తున్నారు. ఆర్ఎం వార్త పత్రిక ద్వారా అయిన దగదర్తి మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించి ఏటీఎం ఓపెన్ చేయాల్సిందిగా దగదర్తి మండల ప్రజలు కోరుతున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్ధులకు ప్రతిభా పురస్కారాలు




**దగదర్తి, మే 16, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం దగదర్తి మండల శాఖ ఆధ్వర్యంలో కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో దగదర్తి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 36 మందికి 500కి పైగా మార్కులు వచ్చాయని విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏపీయుఎస్ రాష్ట్ర సహధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ ఏపీయుసీ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయటమే కాకుండా విద్యార్థులను అభినందిస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఏపీయుఎస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యం నెరవేర్చుకునే విధంగా చదవాలని దేశభక్తి, క్రమశిక్షణ, కలిగి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామలింగాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుండిగం ప్రధానోపాధ్యాయులు ప్రకాశం బాబు, దగదర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్ బాబు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధిస్తున్న విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కేకే చక్రధర్(588), ద్వితీయ స్థానం పొందిన కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థినీ జి.ప్రణతి(572), తృతీయ స్థానం పొందిన ఊచగుంట పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి జి.మొహితేష్(569)లతో పాటు అన్ని ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీయుఎస్ దగదర్తి మండల అధ్యక్షుడు మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా మహిళా కార్యదర్శి రాజమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, డివిజన్ కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు జే.రమేష్, కే.రమేష్, విజయ్ కుమార్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వసంతోత్సవం





**వింజమూరు, మే 16, ప్రభాతవార్త** : నల్లగొండ గ్రామంలో ఉన్న నీలగిరి పర్వతంపై వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం వసంతోత్సవ కార్యక్ర మాన్ని వైభవంగా నిర్వహించా రు. ఆలయ పాలక మండలి చైర్మన్ ఎల్సీ కొండారెడ్డి ఆధ్వర్యంలో తిరుమల వేద పండితులు తనూజ్ విష్ణువర్ధ నాచార్యులు ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనా రాయణ ఆచార్యుల పర్యవేక్షణలో స్వామి వారి కార్యక్రమాలు జరిపించారు. ఉదయాన్నే గణపతి పూజ పుణ్యాహవచనం ఆలయ శుద్ధి విశ్వక్సేనారాధన తదితర కార్యక్రమాలు జరిపించారు. ఆకిలి వెంకటేశ్వరరావు లీలావతిఆకిలిరవి ప్రసాద్, జ్యోతిర్లక్ష్మీ, ఆకిలి రామబ్ర హ్మం, సుబ్బమ్మ, ఆకిలి మురళీ ప్రసాద్, విమల దంపతులుగా స్వామివారి కార్యక్రమాలను జరిపించారు. ముందుగా స్వామివారికి అభిషేకములు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు జరిపించారు. అనంతరం దేవతలకు సంబందిం చిన హోమాది కార్యక్రమాలు నిర్వ హించారు. మధ్యాహ్నం స్వామివారి వసంతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉట్టి కార్యక్రమాన్ని జరిపించారు. యువత ఉట్టిని కొట్టేందుకు ఎంతో ఉత్సా హంతో భక్తిశ్రద్దలతో పోటీలు పడ్డారు. ఈ సమయంలోనే వసంతం పగిలిపోయి ఒకరునొకరు చల్లుకున్నారు. ఈ కార్యక్రమం చూసేందుకు రంగుల హరివిల్లుల ఆకర్షణగా నిలిచింది. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం జరిపించాఉ. రాత్రి 10గంటలకు బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ సందర్భంగా ఎగురవేసిన గరుడ ధ్వజాన్ని అవరోహణ చేశారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపించారు. అదే విధంగా శనివారం స్వామివారి ఏకాంత సేవ జరుగుతుందని ఆలయ పాలక మండలి చైర్మన్ లెక్కల చిన్న కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి కమిటీ ఆలయ ఈవో బి.శాంతయ్య, గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోవూరులో బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరా హోరీ



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూ రులోని కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ రూమ్‌లో శుక్రవారం బార్ అసోసియేషన్‌కు సంబంధించి ప్రధాన కార్యదర్శి పదవికి గానూ ఎన్నిక అని వార్యమైంది. ఈ పదవికి న్యాయవాదులు చంద్రమోహన్, బాబులు పోటీ పడ్డారు. మొత్తం 38 ఓట్లు ఉండగా.. 38 ఓట్లు పోల్ అయ్యాయని ఎన్నికల అధికారి తిరు మలేష్ తెలి



పారు. ఈ మేరకు కౌంటింగ్ నిర్వహించగా చంద్రమోహన్‌కు 26 ఓట్లు, బాబుకు 12 ఓట్లు రావడం జరిగింది. దీంతో చంద్రమోహన్ గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపీపీ గాదిరాజు భాస్కర్, సీనియర్ న్యాయ వాది కృష్ణ, తదితరులు ఉన్నారు.
అసోసియేషన్ అధ్యక్షుడుగా పి. సునీల్‌కుమార్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పి. సునీల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తమవంతుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం వారిని న్యాయవాదులు సత్కరించారు.

## డీసీవో సహకారంతో సొసైటీలు బలోపేతం



**ఇనమడుగు(,కోవూర) మే 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీలో శుక్రవారం పలు కార్యక్రమాలకు వచ్చిన జిల్లా సహకార శాఖ అధికారి గురప్పను పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. జిల్లాలోని సొసైటీలను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా సహకార శాఖ తీసుకున్న పలు విషయాలను ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి ప్రస్తావించి ఆయనను అభినందించారు. కావలి డీఆర్‌తిరుపాల్‌రెడ్డి, ఎస్‌డీ ఎల్‌సీవో సుభాషిణి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సొసైటీ ఉద్యోగులు ఉన్నారు.

## ప్రజల చేతిలోనే ప్రభుత్వ సేవలు: ఎంపీడీఓ




**సైదాపురం, మే 16, ప్రభాతవార్త** ప్రజల చేతిలోనే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలి సారిగా రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర పేరుతో వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించడం జరిగిందని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మనమిత్ర స్టాండ్స్‌ను గ్రామ సచివాలయాలకు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సేవలను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక వాట్సప్ నెంబరు 9552 300009 కేటాయించిందని ఆయనఅన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రమోహన్, పాల్గొన్నారు.

## సర్వీసులను తక్షణమే మంజూరు చేయండి

### - సిబ్బంది క్వార్టర్స్‌లోనే ఉండాలి - పెండింగ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలి



**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త–వైద్యం** పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీస్ కనెక్షన్‌లను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ కే.సంతోష్‌రావు, నూతన టెక్నికల్ డైరక్టర్ గురవయ్యలు ఆదేశించారు. కే.సంతోష్‌రావు, నూతన టెక్నికల్ డైరక్టర్ కే.గురవయ్య శుక్రవారం నెల్లూరు జిల్లా అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెంగింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ వెంటనే మంజూరు చేయాలని మెటీరియల్ అంత సిద్దంగా ఉందని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించాలని ఆదేశించారు. అప్రకటిత కరెంటు కోతలు ఎక్కడ లేదని తెలియజేశారు. అభివృద్ధి పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఆటంకం కలిగితే స్థానిక ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. క్రింది స్థాయి వరకు సూర్య ఘర్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పునరుత్పాధక విద్యుత్‌ను ప్రోత్సహించాలని తెలిపారు. చాలా మంది ఏఈలు వర్క్ ఆర్డర్స్‌లను వెంటనే క్లోజ్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది వారికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని మనం స్థానికంగా అక్కడ ఉంటేనే వినియోగదారులకు మంచి సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా మీకందరికి తెలియజేయడం ఏమనగా వినియోగదారుడు మీ ఆఫీస్‌కు వచ్చినప్పుడు వారికి రెస్పెక్ట్ ఇచ్చి వారిని కూర్చోబెట్టి వారి సమస్యను తెలుసుకోవాలని సూచించారు. వినియోగదారునిని మీ ఆఫీసు చుట్టూ పదే పదే తిప్పుకోవద్దని వారికి ఎన్ని రోజులలో పని చేస్తారో తెలపాలని తెలియజేశారు. విద్యుత్ దీపాలు డై టైంలో వెలుగుతూ ఉండకూడదని, విద్యుత్ స్తంభాలకు క్రీపర్స్ అల్లుకుని ఉండకూడదని ఈ రెండు విషయాలు రెండు నెలలో పూర్తి చేయాలని రెండు నెలల తర్వాత నేను విజిట్ చేస్తానని ఎక్కడైనా క్రీపర్స్ కనిపిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటానని తెలియజేశారు. క్షేత్ర స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయని, ప్రతి ఒక్క అధికారి ట్రాన్స్‌ఫార్మర్స్ ఎందుకు కాలిపోతుందో తనిఖీ చేయాలని అన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సేవలకైనా వినియోగదారులు వాట్సప్ నెంబర్ 9133331912 కు వాట్సప్ చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వాట్సప్ గవర్నెన్స్ 9552300009ను వినియోగదారులందరూ ఉపయోగించుకోని విద్యుత్ సేవలను పొందవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి అధికారి వారి జ్యూరీడక్షన్‌లో వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. వినియోగదారులకు సత్వర సేవలందించడంపై క్షేత్ర స్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విధులు నిర్వహణలో అలసత్వం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరక్టర్ టెక్నికల్ కే.గురవయ్య, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్, నోడల్ ఆఫీసర్ బాల చంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, రమేష్ చౌదరి, శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ, పరందామయ్య, బెనర్జీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళీ, కార్పొరేట్ ఆఫీస్ అధికారి వేణుగోపాల్, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, జిల్లాలోని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.









## వైభవంగా తీర్థవాది.. చక్రస్నానం





**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వీరాంజనేయ స్వామి దేవస్థానంలో తీర్దవాది, చక్రస్థానం కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు , రుత్వికులు రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఈ చక్రస్నానం కార్యక్రమం కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కె. శ్రీనివాసరావు, వెంకట పావని, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి



**నెల్లూరు, మే16 ప్రభాతవార్త–విద్య** ఆంధ్రరాష్ట్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్స వాలను ఈనెల18న నగరంలోని స్థానిక లక్ష్మీపురంలోని ఎస్‌బిఎస్ మండపంలో అట్టహాసంగా నిర్వ హించనున్నామని ,కుల,మత ప్రాంతాలకు అతీతంగా అందరూ పాల్గొని ఈ ఉత్సవాలను విజయ వంతం చేయ్యాలని ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా రైస్ కాన్వాజింగ్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతు పొట్టిశ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించటం జరిగిందన్నారు. ఇందులోభాగంగా రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో ఈ ఉత్సవాలను వేడుకగా జరుపుతున్నారని, గత నెలల్లో ప్రకాశం జిల్లాలో ఈ వేడుకలు జరిగాయానన్నారు. ప్రస్తుతం ఈ నెల 18న స్థానిక ఎస్‌బిఎస్ కళ్యాణ పండపంలో ఉత్సవాల సందర్భంగా అన్నదాన, పేదలకు వస్త్రదాన, కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నామని, ఇందుకు సంబందించిన టోకన్స్‌ను స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్యవైశ్య నాయకులు కోట గురుబ్రహ్మం, మెంటా వీరబ్రహ్మం గుప్తాలు మాట్లాడుతు ప్రత్యేక రాష్ట్రం కోసం 58రోజులు పోటాడి అసువులు బాసిన పొట్టిశ్రీరాములు కేవలం ఆర్య వైశ్యులకు మాత్రమే ఆప్తులు కాదని, యావత్ తెలుగుజాతికి ఆరాధ్యులన్నారు. ఈ గుర్తుగా చేస్తున్న 125వ జయంతి ఉత్సవాలను అందరూ పాల్గోని విజయవంతం చేయ్యాలని వారు కోరారు. అనంతరం జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య నాయకులు సురేష్‌బాబు, కోటా సత్యనారాయణ, దర్శి హరికృష్ణ, ఎంపీ ఆంజనేయులు, మోహనరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములపై అక్రమాలు చేస్తే చర్యలు తప్పవు

### - తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, మే 16, ప్రభాతవార్త:** మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమణలకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డిపేర్కొన్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని సమాచారం, పూర్తిస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా పరిశీలన చేసి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి వెండి ఆభరణాలు బహుకరణ



**వింజమూరు, మే 16, ప్రభాతవార్త** మండలం నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి శుక్రవారం సుమారు రూ.1.50 లక్షల విలువైన వెండి ఆభరణాలను బహుకరించారు. స్వామివారికి శంఖము, చక్రము వెండితో తయారు చేయించి ఆకిలి శాంతమని అల్లుడు వెంకట రంగారావు లక్ష్మీ మాధవి వెంకట శ్రీకర్‌లు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనారాయణ చార్యు లకు అందజేయగా ఆలయ పాలక మండలి చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి సతీమణి వారిని ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వసంతోత్సవానికి ఉభయకర్తలుగా ఉన్న గ్రామ బ్రాహ్మణులు ఆకిలి రవి ప్రసాద్ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఈ గ్రామ బ్రాహ్మణోత్తములు చేస్తున్న అభివృద్ధిని ప్రశంసించారు. ప్రస్తుతం దేవాలయ ఆదాయం 15 లక్షల నుండి 30 లక్షల వరకు పెరిగేలా ప్రణాళికలు సిద్దం చేస్తున్నామని తెలిపారు. అన్ని కులాల వారిని దేవాలయంలో భాగస్వాములు చేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హిందూ మత పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## మరోసారి శివలింగాన్ని చుట్టుకున్న నాగేంద్రుడు



**మనుబోలు మే 16 ప్రభాతవార్త** చెర్లోపల్లి రైల్వేగేటు సమీపాన వెలసి ఉన్న శ్రీ విశ్వనాథస్వామి వారి దేవస్థానం వద్ద నాగేంద్రుడు మళ్ళీ దర్శనమిచ్చాడు. ఇటీవల కాలంలో శివరాత్రికి ముందు శివరాత్రి తరువాత వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామి వారు చెట్టుపైన దర్శనం ఇవ్వడం శివలింగాన్ని చుట్టుకోవడం పుట్టలోకి వెళ్లే వీడియాలు వైరల్‌గా మారాయి. గురువారం సాయింత్రం స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రసాద వితరణ జరుగుతున్న సమయంలో పుట్టలో నుండి వచ్చిన నాగేంద్రుడు స్వామి వారిపై పడగవిప్పడం స్వామి వారిని చుట్టుకోవడం అక్కడ ఉన్న భక్తులందర్ని ఆశ్చర్య పరిచింది. ఈ అద్భుతమైన వీడియోలను తీసి స్వామి వారి దర్శనం మాకు లబించింది అని ప్రజలు ఆనంద భరితులైయ్యారు.

## రక్తపోటును నియమంత్రించండి

### -ధరిచేరని గుండె సమస్యలు



**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త–వైద్యం** గుండె సమస్యలకు ప్రధాన కారణంగా చెప్పుకునే అధిక రక్తపోటును అదుపులో ఉంచుకుంటే గుండె సమస్యలతో పాటు అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ జనరల్ ఫీజిషియన్ డాక్టర్ రవీంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవం(వరల్డ్ హైపర్ టెన్షన్‌డే) సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌లో అధిక రక్తపోటుపై అవగాహన సదస్సును నిర్వహించారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో జనరల్ ఫీజిషియన్ డాక్టర్ రవీంద్రరెడ్డి మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో జీవనశైలి పూరిగా మారిపోయిందని దాని ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తున్నాయని అన్నారు. అందులో ఒకటి రక్తపోటు అని పేర్కొన్నారు. రక్తపోటు (బీపీ) అనేది ఒక్క సారి వస్తే జీవితాంతం అది శరీరంలోనే ఉంటుందని, నిర్లక్ష్యం చేస్తే గుండె సమస్యగా మారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. చాలా మంది వారికి తెలియకుండానే అధిక ఉప్పు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తపోటు భారిన పడుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడు, నెల్లూరు, కర్నూలు వంటి నగరాల్లో పురుష మధ్య వయస్కులు అధికంగా రక్తపోటు భారిన పడుతున్నారని, వీరంతా అధికంగా ఉప్పు కలిగిన ఇంటి ఆహారం ద్వారానే రక్తపోటుకు గురవుతున్నట్లు తాము గుర్తించినట్లు డాక్టర్ రవీంద్రరెడ్డి వెల్లడించారు. ఇంటి భోజనం తింటున్నాం కదా.. ఆరోగ్యంగా ఉంటాం అని చాలా మంది భావిస్తుంటారని, కానీ వాస్తవానికి ఇంటి భోజనంలో తినే ఊరగాయాలు, అప్పడాలు, ఎండుచేపలు ఇతర స్నాక్స్‌లో ఉప్పు శాతం ప్రమాదకర స్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. మెడికవర్ హాస్పిటల్ ద్వారా పరిశీలించిన డేటా ప్రకారం 4 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుషులు వారికి తెలియకుండానే రక్తపోటు భారిన పడుతున్నారని, వారు తరచుగా అలసటం గురి కావడం, కాలు వాపునకు గురి కావడం తలమైకంగా ఉండటం లాంటి సమస్యలతో హాస్పిటల్‌కు వస్తున్నారని, వారిని పరీక్షించగా వారికి అధిక రక్తపోటు ఉంటుందని డాక్టర్ రవీంద్రరెడ్డి వెల్లడించారు. అధిక ఉప్పు కలిగిన ఆహారం తీసుకునే వారు క్రమం లేని జీవనశైలిని పాటించే వారు, గుండె జబ్బుల చరిత్ర ఉన్న కుటుంబాలకు చెందిన వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ అధిక రక్తపోటు వ్యాధికి అధునాతనమైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన వైద్యుల బృందం కూడా ఉందని, మెడికవర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## యువత అన్ని రంగాల్లో ముందుండాలి

### పిడి నాగరాజకుమారి



**నెల్లూరు కలెక్టరేట్, మే 16, ప్రభాతవార్త** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) వారి ద్వారా నిర్వహించబడుతున్న స్కిల్ కాలేజీ ఎస్ఆర్‌టిపి శిక్షణా కేంద్రం, ఐబిటిఎం కాంపస్, గొలగమూడి గ్రామం, వెంకటచలం మండలం, నెల్లూరు జిల్లానకు గౌరవ ప్రాజెక్ట్ డైరెక్టర్, డిఆర్‌డిఎ నెల్లూరు వారు సందర్శించారు. ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న ఈ శిక్షణను మరియు అక్కడ కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. శిక్షణలో వున్నా యువతతో ఇక్కడ కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. యువత ఉద్యోగంలో ఏవిధంగా పని చేయాలి, అలాగే సమాజంలో ఎలా ముందుకు వెళ్ళాలని తెలియజేసేరు. పదోవ తరగతి పాస్ అయిన వారు మరియు 18 నుండి 30 సంవత్సరాలు కలిగి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలలు ఈ అవకాశం సద్వినియోగపరచుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం శిక్షణలో వున్నా యువతకు ఉచితముగా యూనిఫాం, శిక్షణ మెటీరియల్ ను అందించారు. ఈ కార్యక్రమములో సీడాప్ ట్రైనింగ్ సిబ్బంది, ఐబిటిఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు



**కొడవలూరు, మే 16, ప్రభాతవార్త:** మండలంలో రేషన్ కార్డు లేని ప్రజ లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డు లేని ప్రతి ఒక్కరూ స్థానిక తహసిల్దార్ కార్యాలయంకు వచ్చి సంబంధిత పత్రాలను అందజేయాలి తద్వారా పరిశీలన చేసి రేషన్ కార్డ్ మంజూరు చేయడం జరుగు తుందని తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి తెలియజేశారు. అదే విధంగా రేషన్ కార్డులు పొందిన వారు తప్పిదాలు ఉన్న వాటిని కూడా పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ కార్డుల మంజూరు పై అధికారులకు తెలియపరచి పరిష్కారం చేస్తామని ఆమె తెలియజేశారు.